VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..


# కలెక్టరేట్‌లో కలెక్టర్ డీకే బాలాజీ అధ్యక్షతన 43వ నీటి పారుదల సలహా మండలి (ఐఏబీ) సమావేశం




**సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్**

**ఏలూరు కాలువకు ప్రస్తుతం ఇస్తున్న 800 క్యూసెక్కుల నీటిని 1,200 క్యూసెక్కులకు పెంచాలని విప్ యార్లగడ్డ డిమాండ్**

కృష్ణా జిల్లా/గన్నవరం(వాయిస్ టుడే): కృష్ణా జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ నిర్వహించిన 43వ నీటి పారుదల సలహా మండలి (ఐఏబి) సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, పెదన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గన్నవరం నియోజకవర్గ రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పలు కీలక సూచనలు చేశారు. ఏలూరు కాలువ డిజైన్ డిశ్చార్జి 1,650 క్యూసెక్కులు ఉన్నప్పటికీ ప్రస్తుతం 800 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. దీంతో రామవరప్పాడు నుంచి పెరికీడు వరకు ఉన్న రైతులకు తూములు, రెగ్యులేటర్ల ద్వారా సాగునీరు సక్రమంగా అందడం లేదని పేర్కొన్నారు. రైతుల సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏలూరు కాలువకు నిరంతరంగా 1,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని జలవనరుల శాఖ అధికారులను కోరారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో నీటి సంఘాల అధ్యక్షులు సమన్వయంతో వ్యవహరించి, ప్రతి కాలువ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. బుడమేరు వరదల నుంచి ఏలూరు కాలువను రక్షించేందుకు ఎనికేపాడు అండర్ టన్నెల్ సామర్థ్యాన్ని 5,000 క్యూసెక్కుల నుంచి 25,000 క్యూసెక్కులకు పెంచే ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి, రూ.36 కోట్లు మంజూరు చేయడం హర్షణీయమని యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల గోపాలకృష్ణ, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్,తుమ్మల జగదీష్, కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్ జలవనరులు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కోర్టుకు హాజరైన ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు

### కక్షసాధింపు రాజకీయాలపై ధర్మపోరాటం

కృష్ణా జిల్లా/గన్నవరం(వాయిస్ టుడే): గౌరవ న్యాయస్థానం విధించిన కఠిన షరతులను గౌరవిస్తూ, తన అమెరికా పర్యటన ముగిసిన వెంటనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు సోమవారం మచిలీపట్నం కోర్టుకు స్వయంగా హాజరయ్యారు. చట్టంపై ఉన్న అపారమైన గౌరవంతో, విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే ఆయన నేరుగా న్యాయస్థానం మెట్లు ఎక్కడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశమైంది.గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షసాధింపు ధోరణితో, కేవలం వేధింపులకే గురిచేసే లక్ష్యంతో నమోదు చేసిన అక్రమ కేసుల విచారణలో భాగంగానే ఈ హాజరు జరిగింది. విపక్ష నాయకులను ఇబ్బంది పెట్టడమే ధ్యేయంగా అప్పట్లో పెట్టిన తప్పుడు కేసులను చట్టపరంగా ఎదుర్కొనేందుకు ఆయన సిద్ధమయ్యారు. న్యాయస్థానం ఆదేశించిన ప్రతీ నిబంధనను తూచా తప్పకుండా పాటిస్తూ, బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా ఆయన కోర్టుకు వచ్చి తన నిజాయితీని చాటుకున్నారు.కోర్టు హాజరు అనంతరం యార్లగడ్డ వెంకట్రావు మీడియా ముఖంగా గట్టి శపథం చేశారు. ప్రజల ఆశీర్వాదం, తనలోని నిజాయితీ, ధర్మం మాత్రమే తనకు శ్రీరామరక్ష అని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఇటువంటి రాజకీయ కక్షసాధింపు కేసులకు తాము భయపడే ప్రసక్తే లేదని, చట్టపరమైన పోరాటంలో అంతిమ విజయం తనదేనని స్పష్టం చేశారు. ప్రజాసేవలో మరింత అంకితభావంతో, రెట్టింపు ఉత్సాహంతో గన్నవరం నియోజకవర్గ ప్రజల కోసం ముందుకు సాగుతానని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు.




## కొణిదెల ఉపాసన పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు

పాల్వంచ జులై 20 (వాయిస్ టుడే ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కొణిదెల ఉపాసన పుట్టినరోజు సందర్భంగా ఖాసిం పాల్వంచ మెగా ఫాన్స్ అధ్యక్షుడు ఆధ్వర్యంలో లక్ష్మీదేపల్లి ఉన్నటువంటి పంచముఖ అభయాంజనేయ స్వామి గుడి నందు ప్రత్యేక పూజ కార్యక్రమం అనంతరం సాయిబాబా గుడి నందు ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాసిం మాట్లాడుతూ ఉపాసన ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని నిండు నూరేళ్లు ఆరోగ్యంతో ఉండాలని మనస్ఫూర్తిగా ఆ దేవుని కోరుకున్నారని అన్నారు, ఈ కార్యక్రమంలో ఖాసిం, భాష , సాయి తేజ, సందీప్ ,మస్తాన్ ,విజయ్ ,నాగరాజు , తదితరులు పాల్గొన్నారు.

## మా భూములు పోయాయి.. ఇప్పుడు పంటలనూ ఎండబెడతారా?

### పోలవరం కాలువ నీటి నిలిపివేతపై రగిలిన రైతాంగం!

కృష్ణా జిల్లా/గన్నవరం(వాయిస్ టుడే): పోలవరం కుడి ప్రధాన కాలువ సాగునీటి సరఫరా నిలిపివేత వ్యవహారం సూరంపల్లి గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కాలువ గుండా వెళ్తున్న నీటిని పంటలకు పెట్టుకోవద్దంటూ నీటిపారుదల శాఖ అధికారులు అకస్మాత్తుగా జారీ చేసిన ఆదేశాలపై స్థానిక రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కళ్లెదుటే నీళ్లు పారుతున్నా, చేతికొచ్చిన పంటను ఎండబెట్టుకోవాలా అంటూ రైతులు అధికారుల తీరును తీవ్రంగా నిలదీశారు. అధికారుల ఆంక్షల సమాచారం అందడంతో సూరంపల్లి మరియు పరిసర ప్రాంతాల రైతులు, కమ్యూనిస్ట్ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున ఏకమయ్యారు. "పంటలకు నీళ్లు ఆపడం ఎవరితరం కాదు.. ప్రాణాలైనా ఇస్తాం కానీ మోటార్లు బంద్ చేయం" అంటూ ఉమ్మడిగా నినదించారు. కాలువ నిర్మాణం కోసం నాడు తమ విలువైన భూములను త్యాగం చేసింది తామేనని, నేడు కళ్లముందే నీరు వృథాగా పోతుంటే తమ పంటలను ఎండబెట్టి ఆకలితో అలమటించాలా అంటూ అధికారులను సూటిగా ప్రశ్నించారు. పరిస్థితి తీవ్రతను గమనించిన కమ్యూనిస్ట్ నాయకులు రైతులకు అండగా నిలిచారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సూరంపల్లి రైతులకు సాగునీటి హక్కును కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నిరసనకారులంతా కలిసి, నీటి నిలిపివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఉన్నతాధికారులకు ఒక సమగ్రమైన వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఈ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రైతాంగం హెచ్చరించింది.

## ఎస్.టి.యు. 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష' ప్రత్యేక కరదీపిక ఆవిష్కరణ



కృష్ణా జిల్లా/గన్నవరం(వాయిస్ టుడే): ఉపాధ్యాయ అర్హత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు, విధుల్లో ఉన్న ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ రూపొందించిన ప్రత్యేక అధ్యయన సంకలనాన్ని సోమవారం గన్నవరం బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కార్యదర్శి డి. విద్యాసాగర్ మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా ఉపాధ్యాయ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో వారికి ఎంతగానో ఉపయోగపడేలా మనోవిజ్ఞాన శాస్త్రం, తెలుగు, ఆంగ్లం, బోధనా పద్ధతులకు సంబంధించిన అతి ముఖ్యమైన అంశాలను క్రోడీకరించి ఈ ప్రత్యేక కరదీపికను రూపొందించినట్లు తెలిపారు. ఈ పరీక్షలో సులువుగా అర్హత సాధించడానికి ఈ సమాచారం ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సిహెచ్ కృష్ణారావు, మహిళా కన్వీనర్ కలపాల సువార్తరాణి, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం. ఆనంద్ కుమార్, ఆర్. ఆనంద్ కుమార్, నాయకులు ఏ. ప్రకాష్, వీవీఎస్ రాణి తదితరులు పాల్గొన్నారు.



## 4 దశాబ్దాల పూర్వ విద్యార్థుల ఒక వేదికపై కలుసుకోవటం అభినందనీయం:సిఐ శివ ప్రసాద్


కృష్ణా జిల్లా/గన్నవరం(వాయిస్ టుడే): గన్నవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1981-82 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత ఘనంగా జరిగింది. గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో 44 ఏళ్ల క్రితం పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులందరూ తిరిగి ఒకే వేదికపై కలుసుకొని సందడి చేశారు. పాఠశాలలో కలియ తిరుగుతూ అప్పటి తరగతి గది జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని, పాఠశాల మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గన్నవరం సీఐ బీవీ శివప్రసాద్ మాట్లాడుతూ.... పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు సుమారు నాలుగున్నర దశాబ్దాల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడం సంతోషకరమన్నారు. పూర్వ విద్యార్థులందరినీ తిరిగి ఒక చోటకి చేర్చిన ఒకచోటకు చేర్చిన కార్యక్రమం నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. జీవితంలో ఎంత ఎదిగినా పుట్టిన నేలను, విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలను, గురువులను మర్చిపోకూడదని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ. సునీల మాట్లాడుతూ... పాఠశాలకు పూర్వ విద్యార్థులే విలువైన ఆస్తి అని చెప్పారు. పాఠశాల పురోభివృద్ధికి పూర్వ విద్యార్థులు భాగస్వామ్యాలు కావాలని కోరారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పి తమ అభ్యున్నతికి బాటలు వేసిన అప్పటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందిస్తామని పూర్వ విద్యార్థులు ప్రకటించారు . ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాలడుగు నాని, ఎండి. మగ్బుల్, ఎం. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల బహిరంగ వేలం

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే )జూలై 20: నిర్మల్ జిల్లాలో ఎక్సైజ్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను ఈనెల 22న బహిరంగంగా వేలం వేయనున్నట్లు అధికారులు సోమవారం తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్‌డ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం 10 గంటలకు నిర్మల్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఈ వేలం పాట జరుగుతుంది. ఆసక్తి గలవారు నిర్ణీత డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని అధికారులు పేర్కొన్నారు.

## కోరపల్లి పురాతన శివాలయానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటు

### దరఖాస్తులకు ఎండోమెంట్స్ శాఖ ఆహ్వానం





జమ్మికుంట జూలై 20 (వాయిస్ టుడే): జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామ వాస్తవ్యుడు పింగిలి రాకేష్ విజ్ఞప్తికి దేవాదాయ శాఖ స్పందించి ఐదుగురు సభ్యులతో పాలకవర్గం ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం చేసింది. కోరపల్లి గ్రామంలోని పురాతన శ్రీ శివాలయానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయాలని ఫిషర్ మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పింగిలి రాకేష్ ముదిరాజ్ చేసిన విజ్ఞప్తిపై వరంగల్ జోన్ దేవాదాయ శాఖ స్పందించింది. ఈ మేరకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం నుంచి అధికారిక నోటీసు జారీ చేస్తూ, ఆలయానికి ఐదుగురు సభ్యులతో కూడిన ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. తెలంగాణ ధార్మిక మరియు హిందూ మత సంస్థలు, దేవాదాయ చట్టం--1987 (చట్టం నెం.30/1987)లోని సెక్షన్ 15(2), 2007 సవరణ చట్టం మరియు ట్రస్టీల నియామక నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. నోటీసు అందిన తేదీ నుంచి 20 రోజులలోపు ఆసక్తి కలిగిన అర్హులైన వ్యక్తులు ట్రస్టీ పదవికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఉంటే వారు కూడా ఇతరులతో పాటు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తులు నిర్దేశిత ఫారం-IIలో పూర్తి చేసి వరంగల్ దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ లేదా కరీంనగర్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాలకు 20 రోజులలోపు సమర్పించాలని ఆదేశించారు. అలాగే నోటీసును ఆలయ నోటీసు బోర్డు, గ్రామ పంచాయతీ లేదా పురపాలక సంఘం, తహశీల్దార్ కార్యాలయం, కరీంనగర్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం, వరంగల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయ నోటీసు బోర్డులపై వెంటనే ప్రదర్శించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల గడువు ముగిసిన అనంతరం అందిన దరఖాస్తులపై నివేదిక సిద్ధం చేసి, అభ్యర్థుల పోలీసు ధ్రువీకరణ చేపట్టి, నిబంధనల ప్రకారం ట్రస్ట్ బోర్డు ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు దేవాదాయ శాఖ వెల్లడించింది.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం గుర్తింపు కమిటీ సమావేశానికి తరలి వెళ్ళిన నాగార్జునసాగర్ ఉద్యమకారులు



నాగార్జునసాగర్, వాయిస్ టుడే ,జులై 20: హైదరాబాద్ అమర జ్యోతి ప్రాంగణంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం గుర్తింపు కమిటీ సమావేశంలో పాల్గొన్న నాగార్జునసాగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ తెలంగాణ ఉద్యమకారులు.....

హైదరాబాద్ అమర జ్యోతి ప్రాంగణంలో గత 15 రోజుల నుండి గుర్తింపు కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్న సందర్భంగా సోమవారం నాడు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఉద్యమకారులు తరలి వెళ్లారు. సమావేశంలో ఉద్యమ సమయంలో జరిగిన అంశాల గురించి అమరవీరుల కుటుంబాల గురించి , ఉద్యమ సమయంలో ఎఫ్ఐఆర్, కేసులు ఉన్న ఉద్యమకారుల గురించి చర్చించడం జరిగింది. కేకే గుర్తింపు కమిటీ సభ్యులకు పలు సూచనలను సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ కర్ణ బ్రహ్మానందరెడ్డి , రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు సిరికొండ మధు , జిల్లా నాయకులు సిహెచ్ జంగన్న , నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్ ముదిరాజ్ , నల్గొండ జిల్లా కార్యదర్శి , పెద్దవూర మండలం అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్ (వాసు) , ప్రధాన కార్యదర్శి ఊర శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ దవాఖానలలో ఫీజుల నియంత్రణ చేపట్టాలి: బత్తుల రంజిత్

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే )జూలై 20: నిర్మల్ జిల్లాలో గల అన్ని ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్ లలో ఫీజుల నియంత్రణ చేపట్టాలి అని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్ అన్నారు, ఈ రోజు ప్రజా వానిలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ గారి కి వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా లోని అన్ని ప్రైవేట్ హాస్పిటల్ లు మరియు రక్త పరీక్షలు చేసే ల్యాబ్ లలో ఒక్కొ హాస్పిటల్ లో ఒక్కో టెస్ట్ కి అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని అక్కడ కూడా ధరల పట్టికను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో బి స్ ఐ జిల్లా అధ్యక్షుడు మురళీధర్, మల్లేశ్వర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు